ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -71 పేజీలు - 8 వెల - 03/- మంగళవారం 30 జూన్ 2026

## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్యదినోత్సవం

### ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోడీ

**విక్టోరియా,, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. **మిగతా 2లో...**




## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

### అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ

### అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న

**న్యూఢిల్లీ,, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా **మిగతా 2లో...**



## తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది



: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

### తెలంగాణలో త్వరలో బీజేపీ ప్రభుత్వం ఖాయమన్న నితిన్ నబిన్

### బెంగాల్ తరహాలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని శ్రేణులకు పిలుపు

### అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని వ్యాఖ్య

**హైదరాబాద్, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
తెలంగాణలో త్వరలోనే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో కమలం వికసించడం ఖాయమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. **మిగతా 2లో...**

# రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



### దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

### హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలి

### ప్రారంభానికి ప్రధాని మోడీకి ఆహ్వానం

### నిర్మాణ సంస్థలతో సిఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో సీఎం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి **మిగతా 2లో...**




## లొంగిపోయిన హెడ్ కానిస్టేబుళ్లు

### గాదె సాయికృష్ణ మృతి కేసు



**అమరావతి, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
గాదె సాయికృష్ణ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న అశోక్, నాని సూర్యారావుపేట ఏసీపీ కార్యాలయానికి వచ్చి లొంగిపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజుకు వీరిద్దరూ వెన్నంటి ఉండేవారు. సాయికృష్ణ మృతి వ్యవహారంలో అశోక్, నాని ఆయనకు సహకారం అందించినట్లు సిట్ గుర్తించింది. నాగరాజు అరెస్ట్ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన వారిద్దరూ నేడు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కృష్ణలంక స్టేషన్ పరిధిలోని బార్లు, మద్యం దుకాణాలు, లాడ్జీలు.. ఇతరత్రా కార్యకలాపాలకు సంబంధించిన వ్యవహారాలను అశోక్ చక్కదిద్దేవాడు. పలు సెటిల్మెంట్లకు పాల్పడేవాడని ఆరోపణలున్నాయి. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులతో సఖ్యంగా ఉండటం, బెదిరింపులకు పాల్పడటం, నేరస్థులను స్టేషన్‌కు తీసుకురావడం వంటి పనులను నాని చేసేవాడు. నాని పటమట స్టేషన్‌లో పనిచేసినప్పుడు స్పా సెంటర్ల విషయంలో**మిగతా 2లో...**

## తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

### అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం

### ఇరు సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వేదికగా హైదరాబాద్

### భారత్‌లో కే-డ్రామాల ఆదరణతో సాంస్కృతిక అనుబంధం మరింత బలోపేతం

### కళా-సాంస్కృతిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం: మంత్రి జూపల్లి

**హైదరాబాద్, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
ఈ ఏడాది అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని తెలంగాణ - కొరియన్ కల్చరల్ సెంటర్ లు సంయుక్తంగా సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. **మిగతా 2లో...**



## ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

### షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమంలో మంత్రి లోకేశ్

### టెన్త్, ఇంటర్ షైనింగ్ స్టార్లకు నగదు పురస్కారాలు అందచేత





**అమరావతి, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
“మీరు కష్టపడి చదవండి.. విద్యాశాఖ మంత్రిగా మీ కలలను సాకారం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాను“ అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సమాజంలో మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ‘షైనింగ్ స్టార్స్‘ కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. గత ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆయన **మిగతా 2లో...**

## ముఖం చాటేసిన నైరుతి

### దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు

### ఏరువాక సాగక రైతన్న ఆందోళన

**న్యూఢిల్లీ,, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
:దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. **2లో...**



## కూటమి కృషితో సీమకు మహర్దశ

### జగన్ హయాంలో రక్తపుటేరులు పారించారు

### ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వ్యాఖ్య



2లో.

# రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**మొదటిపేజీ తరువాయి**

చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. భవిష్యత్ నగరంగా నిర్మిస్తు?న్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శుల, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

# ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

**మొదటిపేజీ తరువాయి**

ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా, ఆసక్తికరంగా సాగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 'డ్రీమ్ వాల్స్', 'గ్రాటిట్యూడ్ వాల్స్'పై విద్యార్థులు రాసిన మాటలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని లోకేశ్ తెలిపారు. విద్యార్థులు అద్భుతమైన సలహాలు ఇచ్చారని, వారిలో కొంతమంది అయినా రాజకీయాల్లోకి వస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. తాను రాజకీయాల్లో ఉండటం వల్లే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విద్యా సంస్కరణలు ఏపీలో తీసుకురాగలుగుతున్నానని అన్నారు.

**త్వరలో ఏఐ ట్యూటర్.. బలోపేతం కానున్న గ్రంథాలయాలు**

వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ఆకాంక్షలు, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాకినాడకు చెందిన క్రాంతి అనే విద్యార్థి స్కూలు స్థాయి నుంచే కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై శిక్షణ, మోటివేషన్ క్లాసులు, లైబ్రరీల అవసరాన్ని ప్రస్తావించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను ప్రక్షాళన చేస్తున్నామని, పుస్తకాలు చదవడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు.

మండలం, నియోజకవర్గం, జిల్లా, జోనల్ స్థాయిలో లైబ్రరీలను బలోపేతం చేస్తామని, ఏడాదిలోగా అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయాన్ని నిర్మించబోతున్నామని హామీ ఇచ్చారు. మరో విద్యార్థిని అన్నపూర్ణేశ్వరి ఎన్‌సీసీ, కంప్యూటర్ ల్యాబ్ కావాలని కోరగా, త్వరలోనే రాష్ట్రంలోకి ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నామని, అలాగే ఏపీకి ప్రత్యేకంగా ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్‌ను కేంద్రం మంజూరు చేసిందని శుభవార్త తెలిపారు.

**విద్యార్థుల భావోద్వేగ కథలు.. మంత్రి భరోసా**

కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తమ వ్యక్తిగత కష్టాలను, ఉన్నత లక్ష్యాలను పంచుకున్నారు. కదిరికి చెందిన షేక్ చాందిని, ఇంటర్‌లో 1000కి 991 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచానని, తన తండ్రి గుండె జబ్బుతో బాధపడుతున్నారని, ఆయన కోసమే కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నానని తెలిపింది. నీట్ కోసం కోచింగ్ ఇప్పించాలని కోరగా, అందుకు పూర్తి సహాయం అందిస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

టెక్కలికి చెందిన అనన్యశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిణిగా విజన్ 2047 సాధనకు కృషి చేస్తానని చెప్పింది.

ఆత్మకూరుకు చెందిన షేక్ అనీషా, పాఠశాల స్థాయి నుంచే పోటీపరీక్షలకు శిక్షణ ఇవ్వాలని కోరగా, రాబోయే ఐదేళ్లలో 10, 11, 12 తరగతుల విద్యార్థులు చదువుతో పాటు కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రణాళిక రచిస్తామని లోకేష్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా విద్యార్థి పవన్ సాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ కోరగా.. రాబోయేది ఏఐ విప్లవమని, పాఠశాల స్థాయి నుంచే ఏఐ ల్యాబ్స్, ఫండమెంటల్స్‌పై శిక్షణ ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**చదువు మధ్యలో ఆగకూడదు.. అండగా ఉంటా**

అనంతపురం జిల్లా నార్పలకు చెందిన మనీష, తన తండ్రి చదివించలేని పరిస్థితుల్లో ఉన్నారని కన్నీటిపర్యంతమవ్వగా, మంత్రి లోకేష్ చలించిపోయారు. "ధైర్యంగా ఉండు, నీ చదువుకు నేను సాయం చేస్తా" అని హామీ ఇచ్చారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మధ్యలో ఆపకూడదనేదే తన లక్ష్యమని, అలాంటి వారిని గుర్తించి చేయూతనిస్తామని చెప్పారు.

ప్రకాశం జిల్లాకు చెందిన భాగ్యం అనే విద్యార్థిని, చిన్నతనంలోనే పెళ్లయినా ఆరేళ్ల తర్వాత మళ్లీ చదువు ప్రారంభించి ఒకేషనల్ కోర్సులో 990 మార్కులతో టాపర్‌గా నిలిచానని, ఇప్పుడు డిగ్రీ చదవాలని ఉందని చెప్పగా, ఆమెకు కూడా సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఓ విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానంగా, తాను ఎప్పుడూ బట్టీ కొట్టలేదని, తన బలం అప్లికేషన్, ఎగ్జిక్యూషన్, క్రిటికల్ థింకింగ్ అని లోకేశ్ తన విద్యార్థి జీవితాన్ని గుర్తుచేసుకున్నారు.

శంఖవరం విద్యార్థిని స్వాతి తన గ్రామంలోని రోడ్డు దశాబ్దాలుగా అధ్వానంగా ఉందని చెప్పగా, మూడు నాలుగు నెలల్లో రోడ్డు వేయిస్తానని మాట ఇచ్చారు. విద్యార్థులకు శారీరక విద్యతో పాటు మానసిక ఆరోగ్య అవగాహన కూడా కల్పించాలని విశాఖ విద్యార్థి శ్రీహర్ష చేసిన సూచనను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమం కేవలం సత్కారాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలకు, ప్రభుత్వ విధాన రూపకల్పనకు వారధిగా నిలిచింది.

# తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది

**మొదటిపేజీ తరువాయి**

ఆదివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆయన శంషాబాద్‌లో రంగారెడ్డి రూరల్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనితో పాటు మరో తొమ్మిది జిల్లాల కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కనబరిచిన పోరాట పటిమను తెలంగాణలోనూ పునరావృతం చేయాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అరాచక పాలన సాగిస్తోందని నితిన్ నబిన్ ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడంలో బీజేపీ కీలక పాత్ర పోషించగా, ఆ ఫలితాన్ని కాంగ్రెస్ తనకనుకూలంగా మార్చుకుని లబ్ధి పొందిందని ఆయన వ్యాఖ్యానించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గల్లీ, మొహల్లాకు పార్టీ సిద్ధాంతాలను, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ 'డబుల్ ఇంజిన్' సర్కారు ఉంటేనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

అంతకుముందు, శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నితిన్ నబిన్‌కు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీజేపీ నేత ఎన్. రాంచందర్ రావు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన





బూత్ అధ్యక్షుల 'విజయ్ సంకల్ప్ సమ్మేళనం'లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

**మోడీ నేతృత్వంలో విశ్వగురుగా భారత్**
**బిజెపి బూత్ అధ్యక్షుల భేటీలో నితిన్ నబీన్**

ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ విశ్వగురుగా ఎదుగుతోందని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. పన్నెండేళ్ల మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని చెప్పారు. హనుమకొండలో భాజపా బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కల సాకారం కావడంలో భాజపా సహకారం ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సుష్మాస్వరాజ్ ఎంతో కృషి చేశారని చెప్పారు. 'ప్రభుత్వ పథకాల్లో అవినీతి జరగకుండా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారు. జన్‌ధన్ ఖాతాలు ఇచ్చి ప్రభుత్వ సొమ్మును నేరుగా పేదల ఖాతాల్లో జమ చేస్తున్నారు. దేశంలోని 80 కోట్ల పేద కుటుంబాలకు ఆయుష్మాన్ భారత్ వర్తింపజేశారు. దేశ ప్రజలందరికీ ఉచితంగా కొవిడ్ టీకా ఇచ్చిన ఘటన మోదీకి దక్కింది. సెమీ కండక్టర్ పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఏఐ టెక్నాలజీలో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాని కృషి చేస్తున్నారు. వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించాలి. వరంగల్ ఖిల్లాపై కాషాయజెండా ఎగరాలి. విభజన రాజకీయాలు చేస్తున్నవారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. వరంగల్ బిడ్డ పీవీ నర్సింహారావుకు దిల్లీలో అవమానం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు సరైన గౌరవం కూడా ఇవ్వలేదు. పీవీ స్మారక నిర్మాణానికి సోనియాగాంధీ అంగీకరించలేదు' అని నితిన్ నబీన్ విమర్శించారు.

# అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే

ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.

# కూటమి కృషితో సీమకు మహర్దశ

## జగన్ హయాంలో రక్తపుటేరులు పారించారు

## ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వ్యాఖ్య

**అమరావతి, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):** కూటమి ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధిలో పరుగులు పెడుతుందని ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వ్యాఖ్యానించారు. అభివృద్ధికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారని పునరుద్ఘాటించారు. ప్రతిపక్ష హోదా దక్కని వాళ్లు కూడా సిగ్గు, శరం లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రప్పా, రప్పా అంటే పారిశ్రామికవేత్తలు వస్తారా...? అని మంత్రి ప్రశ్నించారు. గతంలో ఉన్న పరిశ్రమలను సైతం రాష్ట్రం నుంచి తరిమికొట్టారని ఆగ్రహించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో రాయలసీమలో రక్తపుటేరులు పారించారని ధ్వజమెత్తారు. సోమవారం అమరావతి వేదికగా మంత్రి జనార్దనరెడ్డి మీడియాతో మాట్లాడారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలు రాయలసీమకు వస్తున్నాయని వివరించారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి డిపాజిట్‌లు కూడా రావని మంత్రి బీసీ జనార్దనరెడ్డి విమర్శించారు.

# తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు చర్చించాయి. భారత్‌లోని కొరియన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్, భారతదేశంలోని కొరియా రాయబార కార్యాలయం కల్చర్ అండ్ ప్రెస్ కౌన్సిలర్ హ్వాంగ్ ఇల్యాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతిపాదిత తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం ద్వారా ఇరు ప్రాంతాల కళలు, సంగీతం, నృత్యం, వంటకాలు, సంప్రదాయాలను ఒకే వేదికపై ఆవిష్కరించే అవకాశం లభిస్తుందని, పర్యాటకాభివృద్ధితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత పెరుగుతాయని తెలిపారు. భారత్‌లో, ముఖ్యంగా యువతలో కొరియన్ కే-డ్రామాలు, కొరియన్ వినోద కార్యక్రమాలకు ఓటీటీ వేదికల ద్వారా విశేష ఆదరణ లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక అనుబంధం తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడంతో పాటు కళలు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, సృజనాత్మక భాగస్వామ్యాలకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, సృజనాత్మక పరిశ్రమల రంగాల్లో కొరియాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వారసత్వ పరిరక్షణ, పర్యాటక ప్రోత్సాహం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో కిమ్ కాంగ్‌హూన్ (హెడ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, ఐఅఅఎ), ఇమ్ హ్వాజే (హెడ్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్, ఐఅఅఎ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కొరియా కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి పాల్గొన్నారు.

-----

# లొంగిపోయిన హెడ్ కానిస్టేబుళ్లు

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపించారు. గన్నవరం స్టేషన్‌లో పనిచేసినప్పుడు ఓ మిస్సింగ్ కేసులో ఆత్కూరు స్టేషన్ ఎస్సైని అని చెప్పి డబ్బులు వసూలు చేసిన వ్యవహారంలో సస్పెండయ్యాడు. సీఐ నాగరాజుకు సన్నిహితంగా మెలిగిన ప్రైవేటు వ్యక్తి సురేష్ కూడా వీరితో కలిసి రౌడీషీటర్ల కౌన్సెలింగ్, నిందితుల విచారణ, తదితర వ్యవహారాల్లో జోక్యం చేసుకునేవాడని తేలింది. గత నెల 29న సాయికృష్ణ బంధువులను కలిసేందుకు ఈ ముగ్గురూ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వెళ్లారని సిట్ అధికారులు గుర్తించారు. సురేష్‌ను సిట్ ఇప్పటికే అదుపులోకి తీసుకుంది.

# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్యదినోత్సవం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷-డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

# ముఖం చాటేసిన నైరుతి

**మొదటిపేజీ తరువాయి**

మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా, ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది. కదిలే మేఘాలు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు, దక్షిణ-మధ్య అరేబియా సముద్రానికే పరిమితమయ్యాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం పటం రుతుపవనాల అస్థిర ప్రభావాన్ని తెలియజేస్తున్నది. గుజరాత్ 86 శాతం వర్షపాతలోటుతో ఉండగా, మహారాష్ట్రలో 60 శాతం లోటు నమోదైంది. మధ్యప్రదేశ్ లో 42 శాతం, యూపీలో 59 శాతం, బీహార్‌లో 52 శాతం, ఒడిశాలో 53 శాతం, తెలంగాణలో 32 శాతం, కర్ణాటకలో 47 శాతం వర్షపాత లోటు రికార్డయ్యింది. తెలంగాణ రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ.. ఎల్ నినో ప్రభావం వల్ల చాలాప్రాంతాల్లో చినుకుజాడ కరువైంది. వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన పెరుగుతున్నది. జూన్ 15 నాటికి దేశంలోని దక్షిణ, తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు, తర్వాత స్తంభించిపోయాయి. దేశంలోని చాలాప్రాంతాల్లో 40 శాతం తకువ వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెల లోటును భర్తీ చేయడానికి కొంతసమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వాతావరణంలో తేమ శాతం పెరుగడం వల్ల, సుదీర్ఘ పొడికాలం తర్వాత అకస్మాత్తుగా కురిసే భారీవర్షాలు, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణకు హైదరాబాద్ వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 8.35 సెం.మీ, కరీంనగర్ జిల్లా రామడుగులో 6.94 సెం.మీ, కరీంనగర్ రూరల్‌లో 6.15 సెం.మీ, జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో 5.20 సెం.మీ, మెట్‌పల్లిలో 4.31 సెం.మీ, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 5.20 సెం.మీ, సూర్యాపేట జిల్లా మద్దిరాళ్లలో 4.09 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదయినట్టు అధికారులు తెలిపారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888
మంగళవారం 30 జూన్ 2026

# కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం వెంకటేశ్వరరావు పై గుంతకల్ 1వ పట్టణ పోలీస్ స్టేషన్లో వైయస్సార్సీపి నాయకుల ఆధ్వర్యంలో ఫిర్యాదు






**గుంతకల్లు ప్రతినిధి 29 జూన్ (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** 21-06-2026 తేదీన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు అలియాస్ నానాజీ గారు ఒక ప్రెస్ సమావేశంలో లో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రివర్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారిని ఉద్దేశించి దుర్భాషలాడుతూ, కించపరిచే విధంగా, అత్యంత అసభ్యకరంగా రెచ్చగొడుతూ మాట్లాడడం జరిగింది. సదరు ఈ సమావేశంలో ఆయన " జగన్ గాడికి దమ్ముంటే నానాజి మిద పోటీ చేయమనండి" జగన్ని కాకినాడ రూరల్ లో పోటీ చేయమనండి. కడప జిల్లా వదిలి ఇక్కడికి వచ్చి పోటీ చేయమనండి తదితర వ్యాఖ్యలు చేయడమే కాక వ్యక్తిగతంగా అవమానపరిచే వాఖ్యలు కూడా చేయడం జరిగింది. రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలు సహజం కానీ ఈ విధంగా మాట్లాడిన వ్యక్తిని శిక్షించాలని గుంతకల్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ నందు సిఐ మనోహర్ గారికి గుంతకల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఎం.డి.ఆర్ ఖలీల్, పి.రాము రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జింకల రామాంజనేయులు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి భావన్న వైయస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డ్యామ్ వలి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకులు నూర్ నిజామీ అనుబంధ సంఘాల నియోజకవర్గ అధ్యక్షులు రంగనాయకులు, బాబురావు యాదవ్, తిక్క స్వామి ,హాజీ ,దశరథ, ప్రభాకర్ రెడ్డి, మనోహర్, ఆంథోనీ,రమేష్ టెంకాయల వెంకటేష్, జగదీశ్వర్, చింతలంపల్లి బుజ్జన్న, నగేష్ ,రామంజి ,మస్తాన్, రియాజ్ ,అంజి, భాష ,కూమార్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# గుమ్మనూరు లో శ్రీ బసవేశ్వర స్వామి నూతన ధ్వజస్తంభ ఊరేగింపు

**ముఖ్య అతిథులుగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు శ్రీనివాసులు**








**చిప్పగిరి, జూన్, 29, (రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామంలో సోమవారం శ్రీ బసవేశ్వర స్వామి నూతన ధ్వజస్తంభ ఊరేగింపు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు శ్రీనివాసులు పాల్గొన్నారు, భక్తులు మంగళ వాయిద్యాల మధ్య గ్రామంలో ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు బిఎల్ఓ, బిఎల్ఎ లకు సహకరించండి

**మండల కన్వీనర్ కొండా పురుషోత్తం**





**చిప్పగిరి, జూన్, 29,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం బెల్డోన గ్రామం నందు క్లస్టర్ 4 నందు 97, 98, 99, బూతుల నందు బిఎల్ఓ, బిఎల్ఎ, ఎస్ఐఆర్ కార్యక్రమం మండల కన్వీనర్ కొండా పురుషోత్తం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు, మండల కన్వీనర్ కొండ పురుషోత్తం మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని, ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కచ్చితంగా ప్రతి ఇంటికి వెళ్లి ఈ సర్వే నిర్వహించాలని, ప్రతి గ్రామంలో ప్రతి ఓటరు బిఎల్ఓ, బిఎల్ఎ, లకు సహకరించాలని, టిడిపి కార్యకర్తలు సీనియర్ నాయకులు ఓటు కాపాడే బాధ్యత మన పైనే ఉందని, కావున కార్యకర్తలందరూ మై టిడిపి యాప్ లో ఎస్ఐఆర్ కార్యక్రమం అప్లోడ్ చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో కోనంకి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు

**మండల కన్వీనర్ కొండా పురుషోత్తం**



**చిప్పగిరి, జూన్, 29,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండల కన్వీనర్ కొండా పురుషోత్తం సోమవారం రైతు లకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు, మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి రైతన్నల పొలాలు పచ్చగా కళకళలాడాలని, పంటలు సుభిక్షంగా పండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు, అనంతరం కుందన గుర్తి గ్రామం లో మాసాపురం గోవిందు ఎద్దులు కరి దింపడం జరిగిందని తెలిపారు, ఈకార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి..

**జూలై 6న రాష్ట్రవ్యాప్తంగా ధర్నా**

**పనిభారం తగ్గించి వేతనాలు పెంచాలని**

**ఏపీ అంగన్వాడి వర్కర్స్ & హెల్పర్స్ అసోసియేషన్ డిమాండ్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 29)** రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాల నిర్వహణలో అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ అంగన్వాడి వర్కర్స్ & హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర నాయకులు తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, 7 నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు ప్రభుత్వం అందించే రైస్, పప్పులు, నూనె, బాలామృతం, బాల సంజీవని కిట్, గుడ్లు, పాలు తదితర టేక్ హోమ్ రేషన్ సరుకులు సమయానికి అందకపోవడంతో లబ్ధిదారులకు పంపిణీలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

అదేవిధంగా 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ప్రీ-స్కూల్ నిర్వహణతో పాటు పోషణ ట్రాకర్, నవచేతన యాప్, ఎఫ్ఆర్ఎస్ నమోదు, బాల సంజీవని వివరాల నమోదు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన ఆన్లైన్ నమోదు వంటి అనేక బాధ్యతలు ఒకేసారి అప్పగించడంతో పని భారం రోజురోజుకూ పెరుగుతోందన్నారు.

ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లు సరిగా పనిచేయకపోవడం, ఇంటర్నెట్ సమస్యలు, టవర్ సౌకర్యం లేకపోవడం వల్ల నెట్ సెంటర్లలో సొంత డబ్బులు ఖర్చు చేసి నమోదు చేయాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ లబ్ధిదారులకు పథకాల నగదు ఆలస్యంగా రావడంతో వారు అంగన్వాడి కేంద్రాలు, వర్కర్ల ఇళ్ల చుట్టూ తిరుగుతూ ప్రశ్నిస్తున్నారని తెలిపారు.

అధికారులు పదేపదే మెసేజ్లు పంపుతూ యాప్లలో సమాచారం నమోదు చేయాలని ఒత్తిడి తెస్తుండటంతో వర్కర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై, బీపీ, షుగర్ వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అన్ని పనులు పూర్తి చేయడం అసాధ్యమని, హెల్పర్ల ప్రమోషన్కు అవసరమైన సర్వీస్ను మూడు సంవత్సరాలకు కుదించాలని, పెండింగ్లో ఉన్న సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే గత 50 సంవత్సరాలుగా ప్రభుత్వ సేవలో పనిచేస్తున్న అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లకు ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ వంటి సంక్షేమ సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరమని, ఆరోగ్యశ్రీ సద్వినియోగం కావడం లేదని, సొంత డబ్బులతో వైద్యం చేయించుకోలేక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన గ్రాట్యుటీ అమలుకు ఇప్పటికీ స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదని విమర్శించారు.

ఈ సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని, లేకపోతే వచ్చే నెల 6వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట భారీ ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అంతకు ముందే సంఘాల నాయకులతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో సోదర సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

ఈ మేరకు ఏపీ అంగన్వాడి వర్కర్స్ & హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర ఇన్చార్జి ఆర్. రవీంద్రనాథ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ప్రేమ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలిత ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలి

**: ఎస్.వి. మోహన్ రెడ్డి**

**కర్నూలు 4, 5 వార్డు సచివాలయాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన**

**బీఎల్ఓల పనితీరుపై ప్రశంసలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 29)** కర్నూలు నగరంలోని 4వ, 5వ వార్డు సచివాలయాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వైఎస్సార్సీపీ కర్నూలు అసెంబ్లీ ఇంచార్జ్, జిల్లా అధ్యక్షుడు ఎస్.వి. మోహన్ రెడ్డి పరిశీలించారు.

ఈ సందర్భంగా బీఎల్ఓ అధికారులతో మాట్లాడిన ఆయన, ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలను నిబంధనల మేరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్న బీఎల్ఓలను అభినందించారు. ప్రజలకు అవసరమైన దరఖాస్తులు, పత్రాల పూర్తి చేయడంలో బీఎల్ఓలు చురుకుగా సహకరిస్తూ ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా శ్రద్ధగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో ఆన్లైన్లో లేదా సంబంధిత బీఎల్ఓ ద్వారా తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం అవసరమైన దరఖాస్తులను వెంటనే పూర్తి చేసి అధికారులకు అందజేయాలని కోరారు.

జూలై 15 తర్వాత కూడా వెరిఫికేషన్, ఇతర సవరణలకు అవకాశం ఉంటుందని, అయితే ఓటరు నమోదు, ప్రాథమిక ధృవీకరణను ముందుగానే పూర్తి చేసుకోవడం అత్యంత ముఖ్యమని ఎస్.వి. మోహన్ రెడ్డి తెలిపారు.

"ప్రతి ఓటు విలువైనది... ప్రతి పౌరుడు తన ఓటు హక్కును తప్పనిసరిగా పరిరక్షించుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజా ఫిర్యాదులపై చట్టపరంగా న్యాయం చేస్తాం

**: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 101 ఫిర్యాదులు**

**ఉద్యోగాల పేరుతో మోసాలు, భూ వివాదాలు, కుటుంబ ఆస్తి తగాదాలు, బంగారం అపహరణపై వినతులు**

**త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 29)** ప్రజా ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ స్పష్టం చేశారు. కర్నూలు కొత్తపేటలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 101 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై త్వరితగతిన స్పందించి చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఉద్యోగాల పేరుతో రూ.36 లక్షలు మోసం చేసిన ఘటన, భూమి విక్రయం పేరుతో మోసం, కుటుంబ సభ్యుల మధ్య బంగారం అపహరణ, ఆస్తి ఆక్రమణ యత్నాలు, విద్యుత్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటన, కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి పంటను ధ్వంసం చేసిన ఘటన వంటి పలు ఫిర్యాదులు అందాయి.

ప్రతి ఫిర్యాదును నిష్పక్షికంగా విచారించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, ఇస్మాయిల్, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి చేతుల మీదుగా తొలి స్నాతకోత్సవం

**జూలై 1న సీయూఏపి లో చారిత్రాత్మక వేడుకలు**

**హాజరుకానున్న గవర్నర్, మంత్రులు పయ్యావుల కేశవ్, నారా లోకేశ్**

**దేశ నిర్మాణానికి విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం**

**ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.ఎ. కోరి**





**అనంతపురం ప్రతినిధి, జూన్ 29,(రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రపతి చేతుల మీదుగా తొలి స్నాతకోత్సవాన్ని జూలై 1న ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అత్యంత వైభవంగా నిర్వహించనుంది. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం జంతలూరులోని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (సీయూఏపీ) తన విద్యా ప్రస్థానంలో మరో చారిత్రాత్మక ఘట్టానికి సిద్ధమైంది. ఈ వేడుకకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై పట్టాలు ప్రదానం చేయడంతో పాటు స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారు. విశ్వవిద్యాలయ కులాధిపతి డా. శంకర్ ఆచార్య అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు.

**జాతీయ స్థాయి భాగస్వామ్యాలకు విశ్వవిద్యాలయం ప్రాధాన్యం**

ఈ తొలి స్నాతకోత్సవంలో 2020 నుంచి 2026 వరకు వివిధ విద్యా సంవత్సరాలకు చెందిన మొత్తం 1,268 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నారు. వీరిలో 480 మంది స్నాతక, 788 మంది స్నాతకోత్తర విద్యార్థులు ఉండగా, వీరు దేశంలోని 23 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే 11 రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 56 విశ్వవిద్యాలయ స్వర్ణ పతకాలు, 8 దాతృత్వ స్వర్ణ పతకాలు అందజేయనున్నారు. 2018లో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం 2019లో పార్లమెంట్ చట్టం ద్వారా కేంద్రీయ విశ్వవిద్యాలయ హోదా పొందింది. ప్రస్తుతం 9 స్నాతక, 18 స్నాతకోత్తర, 6 పీహెచ్డీ, 15 డిప్లొమా కోర్సులతో దేశంలోని 26 రాష్ట్రాలకు చెందిన 1,470 మందికి పైగా విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తోంది. జంతలూరులోని శాశ్వత ప్రాంగణంలో ఆధునిక విద్యా భవనాలు, స్మార్ట్ తరగతి గదులు, అత్యాధునిక ప్రయోగశాలలు, డిజిటల్ గ్రంథాలయం, నెక్స్ట్జెన్ డేటా సెంటర్, మీడియా స్టూడియో, విద్యార్థి వసతి గృహాలు వంటి అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. జాతీయ విద్యా విధానం2020కు అనుగుణంగా వినూత్న విద్యా కార్యక్రమాలు అమలు చేస్తూ పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, జాతీయ స్థాయి భాగస్వామ్యాలకు విశ్వవిద్యాలయం ప్రాధాన్యం ఇస్తోంది.

ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.ఎ. కోరి మాట్లాడుతూ తొలి స్నాతకోత్సవం విశ్వవిద్యాలయ చరిత్రలో చిరస్మరణీయ మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. నాణ్యమైన ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సమగ్రాభివృద్ధి ద్వారా దేశ నిర్మాణానికి తోడ్పడే విద్యార్థులను తీర్చిదిద్దడమే విశ్వవిద్యాలయ లక్ష్యమని ఆయన వివరించారు.

## క్విజ్ పోటీల్లో కర్నూలు మెడికల్ కళాశాల గైనిక్ పీజీల సత్తా

**రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం..**

**ప్రిన్సిపల్ డా. కే. చిట్టి నరసమ్మ అభినందనలు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 29)**గుంటూరు మెడికల్ కళాశాలలో జూన్ 27న నిర్వహించిన 2026 (ఆంధ్రప్రదేశ్ ఇండియన్ సొసైటీ ఫర్ అసిస్టెడ్ రిప్రొడక్షన్) రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో కర్నూలు మెడికల్ కళాశాల గైనకాలజీ విభాగానికి చెందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించి కర్నూలు మెడికల్ కళాశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. మొదటి దశలో నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్‌లో విజయం సాధించిన కర్నూలు మెడికల్ కళాశాల విద్యార్థులు ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించారు. అనంతరం జరిగిన తుది పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి, రెండో స్థానాలను కైవసం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ మెడికల్ కళాశాలలకు చెందిన గైనకాలజీ పీజీ విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో కర్నూలు మెడికల్ కళాశాల నుంచి డా. సాయి మీనాక్షి, డా. పి. జయలక్ష్మి, డా. బి. సుధారాణి, డా. ఎన్.బి. సుప్రజ ఫైనల్‌కు ఎంపికయ్యారు. వీరిలో టీమ్ఎ కు నాయకత్వం వహించిన డా. సాయి మీనాక్షి బృందం ప్రథమ బహుమతి, టీమ్‌డి లోని డా. ఎన్.బి. సుప్రజ బృందం ద్వితీయ బహుమతి సాధించింది.

ఈ సందర్భంగా విజేతలైన పీజీ విద్యార్థులు కర్నూలు మెడికల్ కళాశాల అడిషనల్ డీఎంఈ, ప్రిన్సిపల్ డా. కే. చిట్టి నరసమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థుల విజయంపై ఆమె హర్షం వ్యక్తం చేస్తూ గైనకాలజీ విభాగాధిపతి, అధ్యాపక బృందం, పీజీ విద్యార్థులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో గైనకాలజీ విభాగాధిపతి డా. జి.ఎస్. స్నిగ్ధ, ప్రొఫెసర్లు డా. కె. శ్రీలత, డా. డి. పద్మజ, డా. బి. వరలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్లు డా. ఎ. సుధారాణి, డా. ఎం. ఉమాదేవి, డా. టి. కుముద తదితరులు పాల్గొన్నారు.ი

## పోలీస్ వేదికకు 105 ఫిర్యాదులు

**సత్వర పరిష్కారానికి ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాలు**

**నంద్యాల క్రైం ఫిబ్రవరి 29(రిపబ్లిక్ న్యూస్ ):**




నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ ప్రజల నుంచి 105 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్టపరిధిలో సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించి నివేదికలను జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం ఉండరాదని అధికారులను హెచ్చరించారు.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమం లో 15 వ వార్డు సచివాలయం లో పాల్గొన్న టిడిపి పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు.

**అనంతపురం / గుంతకల్ జూన్ 29 ప్రజా రిపబ్లిక్ న్యూస్**



గుంతకల్ పట్టణంలో ఎస్ ఆర్ ఐ కార్యక్రమంలో 15వ వార్డ్ సచివాలయం లో పరిశీలించిన డాక్టర్ పత్తి హిమబిందు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు గుంతకల్లు మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి ఆదేశాల మేరకు, గుంతకల్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు పరిశీలించారు.

ఈ సందర్భంగా 15వ వార్డు సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి, ఓటరు జాబితాను పరిశీలించారు. అలాగే (SIR`2026 )కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం, ప్రాముఖ్యతపై ఓటర్స్ కు అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. అనంతరం యమునేషన్ ఫారంను ఎలా సరిగ్గా పూరించాలి, ఫారంతో పాటు సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు ఏమిటి, వాటిని సంబంధిత బిపిఎల్‌ఓకు ఎలా సమర్పించాలి అనే అంశాలపై టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు స్వయంగా వివరించి అవగాహన కల్పించారు. ఫారాన్ని పూర్తి వివరాలతో నింపి, అవసరమైన పత్రాలను జత చేసి నిర్ణీత గడువులోపు సంబంధిత బీపీఎల్‌ఓకు సమర్పించాలని ఓటర్లకు సూచించారు. అలాగే బిపిఎల్లు కూడా ప్రతి ఓటరికి ఎస్ ఐ ఆర్2026 కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించి, ఫారాలు నింపే విధానం, అవసరమైన పత్రాలు, సమర్పణ ప్రక్రియపై స్పష్టమైన సూచనలు అందించి, ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా సహకరించాలని సూచించారు.

## బి యల్ ఓ లను నిర్వహిస్తున్న యూనిట్ ఇంచార్జ్ దోశలుడికి బండారు పురుషోత్తం

**అనంతపురం/ గుంతకల్లు జూన్ 29 ప్రజా రిపబ్లిక్ న్యూస్**



గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ గుమ్మనూరు జయరాం గారు మరియు గుంతకల్లు మండల ఇన్‌చార్జ్ శ్రీ గుమ్మనూరు నారాయణస్వామి గారి ఆదేశాల మేరకు, గుంతకల్లు మండలం దోసలుడికి గ్రామం సచివాలయంలో 4,5 బూత్ లు బి ఎల్ ఓ నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ )-2026 ఈ సందర్భంగా దోసలుడికి గ్రామ సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి, ఓటరు జాబితాను పరిశీలించారు. అలాగే ఎస్ ఐ ఆర్ -2026 కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం, ప్రాముఖ్యతపై ఓటర్స్ కు అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. అనంతరం ఎనుమరేషన్ ఫామ్ ను ఎలా సరిగ్గా పూరించాలి, ఫారంతో పాటు సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు (డాకుమెంట్స్ ) ఏమిటి, వాటిని సంబంధిత బి ఎల్ ఓ కు ఎలా సమర్పించాలి అనే అంశాలపై వివరించి అవగాహన కల్పింస్తూ . ఫారాన్ని పూర్తి వివరాలతో నింపి, అవసరమైన పత్రాలను జత చేసి నిర్ణీత గడువులోపు సంబంధిత బి ఎల్ ఓ కు సమర్పించాలని ఓటర్లకు సూచించారు. అలాగే బి ఎల్ ఓ లు కూడా ప్రతి ఓటరికి ఎస్ ఐ ఆర్ -2026 కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించి, ఫారాలు నింపే విధానం, అవసరమైన పత్రాలు, సమర్పణ ప్రక్రియపై స్పష్టమైన సూచనలు అందించి, ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో యూనిట్ ఇంచార్జ్ బండారి పురుషోత్తం బూత్ ఇంచార్జి జిలకర దామోదర్ తదితరులు పాల్గొన్నారు

# దోమల నివారణకు నగరపాలక సంస్థ పటిష్ట చర్యలు

**వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి**

**39 మంది ప్రత్యేక సిబ్బందితో అబేట్ స్ప్రేయింగ్, ఫాగింగ్ ముమ్మరం**

**ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ చల్లా ఓబులేసు సూచన**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 29)**

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నగరంలో దోమల నివారణకు నగరపాలక సంస్థ పటిష్ట చర్యలు చేపట్టిందని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు.

వీకర్ సెక్షన్ కాలనీ-2లో అబేట్ ద్రావణం పిచికారీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం బుధవారపేటలో 6వ శానిటేషన్ డివిజన్ మస్టర్‌ను తనిఖీ చేసి, కే.సి. కెనాల్, దేవనగర్, ఇందిరమ్మ కట్ట, చెన్నమ్మ సర్కిల్, ఎల్కూర్ బంగ్లాస్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను సమీక్షించారు. సెట్కూర్ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరవ్యాప్తంగా 39 మంది ప్రత్యేక సిబ్బంది, 10 యంత్రాల సహాయంతో అబేట్ స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి వీధిలో పది రోజులకు ఒకసారి అబేట్ ద్రావణం పిచికారీ, రెండు వారాలకు ఒకసారి మలాథియాన్ ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల్లో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వేస్తున్నామని చెప్పారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సీనియర్ ఎంటమాలజిస్ట్ సత్యనారాయణ, శానిటరీ సూపర్వైజర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జిలానీ, ఫరూక్, అలింబాష తదితరులు పాల్గొన్నారు.

# సహకార వారోత్సవాలు ఘనంగా..

# జిల్లావ్యాప్తంగా సహకార రచ్చబండలు, మొక్కల నాటకం

**రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించిన జిల్లా సహకార అధికారులు**

**పలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కార్యక్రమాలు విజయవంతం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 29)**

సహకార వారోత్సవాల సందర్భంగా కర్నూలు జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల ఆధ్వర్యంలో సహకార రచ్చబండలు, మొక్కల నాటే కార్యక్రమాలు, సహకార జెండా ఆవిష్కరణలు ఘనంగా నిర్వహించారు. పసుపల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో నిర్వహించిన "సహకార రచ్చబండ" కార్యక్రమానికి జిల్లా సహకార అధికారిణి శ్రీమతి ఐ.డి. శిరీష, జిల్లా సహకార ఆడిట్ అధికారిణి/డివిజనల్ సహకార అధికారిణి శ్రీమతి బి. చెన్నమ్మ హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలపై రైతులకు వివరించి అవగాహన కల్పించారు. అనంతరం సంఘ ఆవరణలో మొక్కలు నాటారు. కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో జిల్లా సహకార అధికారిణి ఐ.డి. శిరీష, డివిజనల్ సహకార అధికారిణి బి. చెన్నమ్మ, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి. రామాంజనేయులు, సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ టీ. నాగరమణయ్య, సహకార శాఖ మరియు బ్యాంకు సిబ్బంది పాల్గొని మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో చైర్మన్ శ్రీ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సహకార రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. రైతులు, సహకార సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కర్నూలులో చైర్మన్ శ్రీ వై. నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. అదేవిధంగా దేవనకొండ, ఉప్పర్లపల్లి, ఆలూరు, సి. బెళగల్, ఆస్పరి, లద్దగిరి, గోనెగండ్ల, మద్దికేర, పత్తికొండ తదితర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో సహకార సంఘ జెండాలను ఎగురవేసి, మొక్కలు నాటి సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

# అమిలినేని జేబులోకే బెల్ట్ షాపుల అక్రమ వసూళ్లు

**వైయస్సార్సీపి మాజీ ఎంపీ తలారి రంగయ్య**

**372 బెల్ట్ షాపులతో అక్రమ దోపిడి**

**ఎక్సైజ్ సీఐకి వైఎస్సార్సీపీ వినతిపత్రం అందజేత**

**అనంతపురం / కళ్యాణదుర్గం క్రైమ్, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**






కళ్యాణదుర్గం నియోజకవర్గంలో బెల్ట్ షాపుల పేరుతో అక్రమంగా అదనపు వసూళ్లు జరుగుతున్నాయని మాజీ ఎంపీ, వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య ఆరోపించారు. ఈ అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేశారు.

**నియోజకవర్గంలో అడ్డగోలుగా మద్యం వ్యవస్థ**

ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ అధికార పార్టీ అండదండలతో నియోజకవర్గంలో మద్యం అక్రమ వ్యాపారం విస్తరించిందని విమర్శించారు. మొత్తం 372 బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం కొనుగోలు చేసే వారి నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ వసూళ్ల ద్వారా వచ్చే సొమ్ము నేరుగా ఎమ్మెల్యే అమిలినేని వద్దకే చేరుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని నియోజకవర్గంలో అడ్డగోలుగా మద్యం వ్యవస్థను నడుపుతున్నారని పేర్కొన్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ, అక్రమ వసూళ్లపై ఎక్సైజ్ శాఖ సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి అక్రమాలను అరికట్టకపోతే వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని రంగయ్య హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు దొడగట్ట నారాయణ, ములకనూరు తిమ్మరాయుడు, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, ఐదు మండలాల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ పార్లమెంట్ లో బిజెపి ని ఓడించాలి

**- బీఎస్పీ జోన్ ఛీఫ్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం**

**ఆదిలాబాద్ పతినిధి జూన్ 29( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**





అదిలాబాద్ పార్లమెంట్ లో బిజెపి ని ఓడించాలని బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు . ఈ రోజు అదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ తుడిచెర్ల సంజయ్ అదిలాబాద్ పార్లమెంట్ రివ్యూ సమావేశం కి ముఖ్య అతిథిగా హాజరై పూలే అంబేడ్కర్ కాన్షీరాం గార్ల చిత్ర పటాలకు పూలతో నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సమిక్ష సమావేశంలో మూడు జిల్లాలైన అసిఫాబాద్ అదిలాబాద్ నిర్మల్ జిల్లా కమిటీల ను పార్లమెంట్ పరిది లోని ఏడు అసెంబ్లీల కమిటీ లను రివ్యూ చేశారు. పార్టీ ని బూత్ కమిటీ వరకు నిర్మించాలని నాయకులకు ఆదేశాలు ఇచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు చాలా కీలకమని ఈ పార్లమెంట్ లో బిజెపి ని ఓడించి బహుజన్ సమాజ్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశం లో అధికారంలో ఉన్న బిజెపి రాజ్యాంగం ను రద్దు చేయాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. గత ఎన్నికల్లో బహిరంగ సభల్లో బిజెపి నాయకులు మాకు 400 ఎంపిలు ఇస్తే ఈ రాజ్యాంగం ను రద్దు చేస్తామని చెబుతుంటే రాజ్యాంగం వల్ల ప్రయోజనాలు పొందిన బహుజన్ సమాజం నుండి తిరుగుబాటు రాకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాజ్యాంగం రద్దు అయితే మనం శాశ్వతంగా బానిసలుగా మారిపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ లో దళితులపై మహిళ లపై నిత్యం మానబంగాలు హత్యలు జరుగుతున్నాయి అని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపి లకు గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు . బహుజన ఉద్యమం బలోపేతం చేయడం వల్లనే బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పారు. అందుకోసం మనం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మతం పేరు మీద కులం పేరు మీద దేశాన్ని విడదీసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జోన్ ఇంచార్జి కల్లెపెల్లి రాజేందర్, పార్లమెంట్ ఇంచార్జ్ తుడిచెర్ల సంజయ్ , అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రత్నపురం రమేష్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెరుకు రాజ్యం కార్యవర్గ సభ్యులు కాటం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు . ఈ రోజు చెరుకు రాజ్యం ఆద్వర్యం లో ముధోల్ నియోజకవర్గం నుండి వాగ్మారే విలాస్ తన అనుచరులతో నిషాని రామచంద్రం సమక్షంలో బీఎస్పీ లో చేరగా ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# ఎన్‌టీఏ రద్దు చేయాలంటూ ఐసా నిరాహార దీక్ష

## జంతర్‌మంతర్ ఉద్యమానికి అనంతలో సంఘీభావం

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

## పారదర్శక పరీక్షల వ్యవస్థ ఏర్పాటు చేయాలని విద్యార్థి నాయకుల విజ్ఞప్తి




**అనంతపురం కలెక్టరేట్, జూన్ 29,(రిపబ్లిక్ న్యూస్):** ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో అవినీతి, విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఐసా ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక ఉద్యమానికి సంఘీభావంగా అనంతపురం జిల్లా ఐసా నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి పారదర్శకత, జవాబుదారీతనం కలిగిన కొత్త పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న అవకతవకలకు అడ్డుకట్ట వేయడంతో పాటు విద్యా వ్యవస్థ వైఫల్యాల కారణంగా నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పదేపదే విఫల మవుతోందని విమర్శించారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర అనిశ్చితి, ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అమలు చేసి విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో ఐసా జాతీయ నాయకుడు వేమన, జిల్లా నాయకులు శివకుమార్, బాలకృష్ణ, రమేష్, శివప్రసాద్, నవాజ్, ఉపేంద్ర, అంజి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అడ్మిషన్లు ఫుల్ -సదుపాయాలు నిల్

## ఓర్వకల్లు మండలంలో అపాస్మా పేరుతో ఇష్టరాజ్యాంగ మారిన వైనం

## మారుటే సపరేటు అంటున్న ప్రవేట్ స్కూల్స్ యాజమాన్యాలు

**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 29(రిపబ్లిక్ న్యూస్)**

విద్యా హక్కు చట్టం కు తూట్లు పొడుస్తున్న ప్రైవేటు , కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు



స్థానిక ఓర్వకల్లు మండల కేంద్రంలో ఎమ్మార్వో ఆఫీస్ లో పిజి అర్ ఎస్ కార్యక్రమంలో ఎమ్మార్వో విద్యా సాగర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ (అర్విఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్ర నాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న లు మాట్లాడుతూ ఓర్వకల్లు మండలంలో ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు చేసి,అధిక ఫీజులు దోపిడీ చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఓర్వకల్లు మండలంలో ఉన్నటువంటి కొన్ని ప్రైవేట్ . కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా,అర్హత కలిగిన అధ్యాపకులు లేకుండా,శానిటేషన్ సర్టిఫికెట్ లేకుండా,ఆటస్థలం పార్కింగ్ స్థలం లేకుండా రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి నోటుపుస్తకాలు. యూనిఫామ్. బెల్ట్. షూ. వంటి మెదలగు వాటి పేర్లతొ మా స్కూల్ లోనే కోనాలి అనే నిబంధన ఎత్తి వేయాలని అలాగే వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ కూడా మండలంలో ఉన్నటువంటి విద్యాశాఖ అధికారి(ఎమ్ ఇ ఓ -1)ఎటువంటి చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్టుగా ఉండడంలో అంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తాము నిర్ణయించుకున్నటువంటి ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నటువంటి ఓర్వకల్లు మండల ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఎమ్మార్వో విద్యా సాగర్ అలాగే మండల విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకుని ప్రైవేటు. కార్పొరేట్ పాఠశాల ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని అలాగే ఆయా స్కూల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే అధిక ధరలకు పుస్తకాలు. యూనిఫామ్ ,బెల్ట్ విక్రయాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో నాయకులు బాలక్రిష్ణ నాయక్ . వెంకీ. మనోహర్, చంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## వట్టిపల్లి మండల్ సాయి పేట గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం ప్రారంభం



**అందోల్ ప్రతినిధి జూన్ 29( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**సాయిపెట్ గ్రామంలో నూతన సిసి రోడ్డు శంకుస్థాపన ..... వట్టిపల్లి మండల్... సాయిపెట్ గ్రామంలో నూతన సిసి రోడ్ ప్రారంభోత్సవం ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆలూరి సంతోష ఆంజనేయులు మరియు ఉపసర్పంచ్ సామల మీనా చంద్రశేఖర్ మరియు వార్డ్ నెంబర్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు

# దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లకు సుప్రీం కోర్ట్ గుడ్ న్యూస్

## పత్రికా విలేకరులకు మంచి నిర్ణయం తీసుకున్నందుకు సుప్రీం కోర్ట్ కు కృతజ్ఞతలు తెలిపిన మీ కాశపాగ ఇ మయ్యా

**సంగారెడ్డి ప్రతినిధి జూన్ 29 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**



పెన్ను పట్టిన,వీడియో కెమెరా పట్టి తమ విధులు రోజు వారి వార్త, న్యూస్ ప్రసారాలు నిర్వహిస్తున్నా వారందరు జర్నలిస్ట్ స్టులే.!!సుప్రీం కోర్ట్ ఇకపై కావాలనే కక్ష్య తో రాజకీయ నాయకులు,అక్రమ సంపాదన దందాలు చేసే వారు,వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వాళ్ళ బాగోతలపై నిజాలను నిర్భయంగా వార్త రాసిన, న్యూస్ ప్రసారాలు చేసిన జర్నలిస్ట్ లపై అక్రమ కేసులు చెల్లనేరావు:సుప్రీం కోర్ట్ శాటిలైట్ ఛానెల్స్,యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్,ప్రింట్ మీడియా సంస్థల్లో పని చేసే జర్నలిస్ట్ లు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అక్రమ కేసుల లేక నిజ నిరూపణ కేసుల అనేది ఆయా సంఘాల ద్వారా పరిష్కారం కొరకు 7రోజుల్లో నిర్ణయం తీసుకున్నే హక్కులు జర్నలిస్ట్ సంఘాలకే ఉంటుందని,వాళ్ళను కాదని అక్రమ కేసులు పెట్టిన వాళ్ళపై,అట్టి పోలీస్ లపై వేట తప్పదు:సుప్రీం కోర్ట్.....

# 5 రోజుల్లో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తి చేయాలి

**: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు లేదన్న కలెక్టర్**

**ప్రజలకు మెరుగైన సేవలతో సానుకూల ప్రజాభిప్రాయం పెంపొందించాలని సూచన**

**పీజీఆర్ఎస్ ఫిర్యాదులను గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**

**నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిక**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 29)** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను ఐదు రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతి గడువును కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

ప్రస్తుతం డిజిటైజేషన్ పురోగతి తక్కువగా ఉందని, ప్రతిరోజూ కనీసం 10 శాతం చొప్పున పురోగతి సాధించి శనివారంలోగా పూర్తి చేయాలని ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు సూచించారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పెంపొందించాలని, అన్ని శాఖలు తమ పనితీరును కనీసం 10 శాతం మెరుగుపరచి ప్రజల సంతృప్తి స్థాయిని 80 శాతానికి పైగా తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఉద్యాన పంటల విస్తరణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ఉద్యానశాఖ అధికారులకు సూచించారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం అస్సలు సహించబోమని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి ఫిర్యాదును గడువులోగా పరిశీలించి, సంబంధిత అర్జీదారులతో మాట్లాడి నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే తహసీల్దార్లు, వీఆర్ఓలు, ఇతర అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సునీత, అనురాధ, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి, డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పెద్దటేకూరు గ్రామం లో ఘనంగా ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు

**కల్లూరు ప్రతినిధి, జూన్ 29(రిపబ్లిక్ న్యూస్)**






ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కార్యదర్శి కె జగనాథం హాజరై ఎద్దులకు పూజ చేసి అనంతరం పొలం దున్ని ఏరువాక పౌర్ణమి: వ్యవసాయ పండుగ శుభాకాంక్షలు రైతులందరికీ తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి (దీనిని 'ఏరువాక పున్నమి' అని కూడా అంటారు) తెలుగు రైతాంగానికి అత్యంత ముఖ్యమైన మరియు శుభప్రదమైన పండుగ. జ్యేష్ఠ మాసపు పౌర్ణమి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. ఇది ప్రధానంగా వర్షాకాల ప్రారంభానికి, వ్యవసాయ పనుల ఆరంభానికి సూచికగా నిలుస్తుంది. పండుగ విశిష్టతవ్యవసాయ ఆరంభం: రైతులు తమ పొలాలను దున్నడానికి సిద్ధమయ్యే రోజు ఇది. "ఏరువాక" అంటేనే నాగలితో పొలాన్ని దున్నడం మొదలుపెట్టడం అని అర్థం. ప్రకృతి ఆరాధన: ప్రకృతిని, భూమాతను, పశువులను పూజించి, మంచి పంటలు పండాలని వేడుకుంటారు. తెలుగు సంస్కృతి: ఇది మన పల్లెటూరి సంస్కృతికి ప్రతిబింబం. వానాకాలం రాకను ఆహ్వానిస్తూ రైతులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకను జరుపుకుంటారు. అని ఆయన అన్నారు. ఇలాంటి పండగలు కనుగొరుగైపోతున్నాయి అందుకు కారణము ఈ ప్రభుత్వాల వైఫల్యం అని ఆయన అన్నారు. రైతుల కౌలు రైతులు రైతాంగ సమస్యల పరిష్కార కొరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మాదిరిగా మన రాష్ట్రంలోనూ రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని ప్రతి రైతుకు, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, అన్నదాత సుఖీభవ 20వేల నుండి 50 వేల రూపాయలకు పెంచి ఇవ్వాలని, కౌలు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రూపాయల వరకు రుణాలు మంజూరు చేయాలని , స్వామినాథ సిఫారసు మేరకు గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులన్ని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్లతో ఈనెల 30వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని దాన్ని జయప్రదం చేయాలని రూ ఈ సందర్భంగా రైతులందరికీ పిలుపునిచ్చారు వారు. ఈ కార్యక్రమంలో రైతు సీనియర్ నాయకులు పుల్లన్న, గ్రామ కార్యదర్శి బోయసంకులు,కే మద్దయ్య, కురువ శేఖర్ , మౌలాలి, ఆంజనేయ, పెద్దయ్య తదిత రైతులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి జనసేనను బలోపేతం చేస్తాం

**జిల్లాలో సమాచార సేకరణ కార్యక్రమం**

**పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలందరికీ సముచిత స్థానం**

**టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్**



**అనంతపురం ప్రతినిధి, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):** గ్రామస్థాయి నుంచి జనసేనను బలోపేతం చేస్తామని, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలందరికీ సముచిత స్థానం కల్పిస్తామని టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టిడ్కో రాష్ట్ర చైర్మన్, జనసేన పార్టీ సమాచార సేకరణ పరిశీలకులు వేములపాటి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

**పార్లమెంట్ పరిధిలోని కమిటీలకు దరఖాస్తుల స్వీకరణ**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జిల్లాలో ఐదు రోజుల పాటు విస్తృత సమాచార సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. 2014 నుంచి పార్టీ కోసం నిరంతరం కష్టపడిన కార్యకర్తలు, నాయకుల వివరాలను సేకరించి వారికి తగిన గుర్తింపు కల్పించే దిశగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. గ్రామ కమిటీల నుంచి పార్లమెంట్ స్థాయి కమిటీల వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. అనంతపురం పార్లమెంట్ పరిధిలోని కమిటీలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, పార్టీ కోసం పనిచేసి పదవులు ఆశించే ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిశీలించిన అనంతరం తుది నిర్ణయాన్ని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తీసుకుంటారని స్పష్టం చేశారు.

**పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మరింత విస్తృతం**

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ కార్యకర్తలతో ప్రత్యక్షంగా సమావేశమై వారి అభిప్రాయాలు, సమస్యలు, పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలు సేకరిస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతూ ఇప్పటివరకు సరైన గుర్తింపు పొందని నాయకులను గుర్తించి వారి వివరాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదును మరింత విస్తృతంగా నిర్వహిస్తూ ప్రతి కార్యకర్త సభ్యత్వం పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభ్యత్వం నుంచి నాయకత్వం వరకు కార్యకర్తలను తీర్చిదిద్దే ప్రక్రియకు ఈ సమాచార సేకరణ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పరిశీలకుల కమిటీ కేవలం సిఫారసులు మాత్రమే చేస్తుందని, నియామకాలపై పూర్తి అధికారాలు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కే ఉంటాయని అజయ్ కుమార్ స్పష్టం చేశారు.

గతంలో క్షేత్రస్థాయిలో పార్టీ బలహీనంగా ఉన్న విషయం వాస్తవమేనని అంగీకరించిన ఆయన, ప్రస్తుతం గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. జనసేన పార్టీ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి వైఎస్సార్‌సీపీ భయపడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. జిల్లాలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటు కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం కల్పించే దిశగా ఈ సమాచార సేకరణ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని అజయ్ కుమార్ పేర్కొన్నారు. సమావేశంలో సెవెన్ మ్యాన్ కమిటీ సభ్యులు భవాని రవికుమార్, జయరాంరెడ్డి, రామకృష్ణ, బి. చంద్రకళ, సాయి శరణ్య, ఎస్.కె. దూద్‌వలి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సహకార వారోత్సవాలు

## రైతాంగ సంక్షేమానికి సహకార రంగం వెన్నెముక -చైర్‌పర్సన్ కేశవరెడ్డి







**అనంతపురం సంక్షేమం, జూన్ 29,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఏడీసీసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బ్యాంకు చైర్‌పర్సన్ ముంటిమడుగు కేశవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సహకార పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు.

**ఖాతాదారులకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, రైతాంగ అభ్యున్నతిలో సహకార రంగం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఖాతాదారులకు మరింత నాణ్యమైన, వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ఏడీసీసీబీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి అరుణకుమారి, డీఎల్‌సీఓ వెంకట్రామిరెడ్డి, నాబార్డ్ డీడీఎం అనురాధ, శ్రీ సత్యసాయి జిల్లా డీఎల్‌సీఓ ఆదినారాయణ, ఏడీసీసీబీ సీఈఓ విజయ్‌కుమార్, జనరల్ మేనేజర్ సురేఖారాణి, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

# వి బి జి రాంజీ నూతన పథక ప్రారంభోత్సవ సభ పనులను పర్యవేక్షించిన సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్.





**రైల్వే కోడూరు జూన్ 29 రిపబ్లిక్ న్యూస్.**

ఓబులవారిపల్లి మండలం ముక్కవారిపల్లి పంచాయతీ మంగంపేట ఆర్‌ఆర్ 5 ప్రాంతంలో ప్రారంభించబోయే వి బి జి రాంజీ నూతన పథకం ప్రారంభోత్సవ సభాస్థలి ఏర్పాట్లను సోమవారం ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్ పరిశీలించారు, అనంతరం స్టేజి లో కొద్దిగా మార్పులు సూచించినట్టు ఆయన తెలిపారు, ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు,జనసేన పార్టీ శాసనసభ్యులు ఆరవ శ్రీధర్, కూడా చైర్మన్, రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి, రైల్వే కోడూరు టిడిపి యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి సభా ప్రాంగణ పనులను పరిశీలించారు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా కార్యక్రమానికి హాజరు అవుతారని పెందుర్తి తెలియజేశారు అనంతరం పెందుర్తి మాట్లాడుతూ త్వరితగతిన సభాను, ముఖ్యమంత్రి దిగబోయే హెలిపాడ్డు సభలో పాల్గొనబోయే అతిధుల అధికారుల అనధికారుల రాజకీయ నాయకుల కార్యకర్తల పార్కింగ్ పనులను నాణ్యతతో పకడ్బందీగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు తెలియజేశారు,

జులై రెండవ తేదీన జరగబోయే వి బీజీ రాంజీ గ్రామీణ హామీ పథకం ప్రారంభోత్సవ సభ కు సంబంధించి ఏర్పాట్లను అధికారులఆధ్వర్యంలో సోమవారం సభాస్థలి ఏర్పాట్లు పెందుర్తి వెంకటేష్ సమీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన అధికారులు సభా ప్రాంగణానికి సంబంధించి ఏర్పాట్లపై సమీక్షించి, ప్రాంగణంలో విఐపి పార్కింగ్, హెలిపాడ్ ప్రెస్ గ్యాలరీ మరియు ఇతర విషయాలపై కూడా సమీక్షించారు. కార్యక్రమంలో ఓబులవారిపల్లి మండల తహసిల్దార్ ఆకుల సిద్దేశ్వర రావు,రెవిన్యూ అధికారి మల్లికార్జున్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి ఎం వి ఎన్ రాజేందర్, డిప్యూటీ ఎండిఓ రామ్మోహన్ రెడ్డి,,డిప్యూటీ ఎండిఓ కృష్ణ, డి ఈ బాల నరసింహులు, ఏ ఈ ఆంజనేయ ప్రసాద్, రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఏ చంద్రమోహన్, కల్లా చలపతి, వేణుగోపాల్ రెడ్డి, పుల్లంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపేర్ల చంద్రశేఖర్ నాయుడు, పి వాసుదేవ రెడ్డి, జీవిపురం మాజీ ఎంపిటిసి పనింద్ర, మాజీ ఎంపిటిసి సుబ్రహ్మణ్యం ,యువ నాయకులు కావుటూరు గజేంద్రనాయుడు, వెంకటేష్ ఆచారి, మైనారిటీ నాయకుడు షేక్ వల్లి,ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**జిల్లా కలెక్టర్,ఎస్పీ ని మర్యాదపూర్వక కలిసిన కస్తూరి, కేకే చౌదరి.**

జూలై రెండవ తారీఖున జరగబోయే సీఎం సభ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి వెళుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు లను రైల్వే కోడూరు పట్టణంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు, అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీఎం సభ జయప్రదం చేయడానికి కార్యకర్తలతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర కాజీ పరిశ్రమ శాఖ చైర్మన్ కేకే చౌదరిల ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా కస్తూరి విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ కోడూరు నియోజకవర్గంలో ప్రియతమ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమావేశం జరగనున్న సందర్భంగా నియోజకవర్గంలోని నాయకులందరూ పార్టీలో అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ భవిష్యత్తు దృష్ట్యా పటిష్టత దృష్ట్యా అందరూ కలిసి కట్టుగా తమ శక్తివంచన లేకుండా భారీ స్థాయిలో కార్యకర్తలను ప్రజలను తీసుకురావాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు, ఖాదీ పరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరి మాట్లాడుతూ నియోజకవర్గంలో నాయకులందరూ విభేదాలను పక్కనపెట్టి ప్రీతము ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయడానికి అందరూ కలిసికట్టుగా భారీ సంఖ్యలో కార్యకర్తల తరలించాలని ఈ విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకొని నడుచుకోవాలని ఆయన వారికి సూచించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనాధ శవానికి దహన క్రియలు చేసిన పోలీసులు



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 29 రిపబ్లిక్ న్యూస్**

అన్నమయ్య జిల్లా, పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానం దిగువ సూలము వద్ద యాచకుడు(70) అనాద వ్యక్తి మరణించగా దిగువపల్లి గ్రామ పంచాయతీ అధికారులకూ సమాచారం అందించి, పంచాయతీ కార్మికులు, పోలీసులు సదరు అనాద మృతదేహాన్ని బోయకొండ దేవిరెడ్డి చెరువు గట్టుపైన దహనసంస్కారం చేశారు.

## బోయకొండపై అలరించిన చండీ హోమం



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 29 రిపబ్లిక్ న్యూస్** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం నిర్వహించిన చండీ హోమం భక్తులను అలరించింది ప్రతినెల పౌర్ణమిన లోక కళ్యాణం కోసం నిర్వహించే చండీ హోమంలో వేద పండితులు గోవర్ధన శర్మ ఆధ్వర్యంలో ఉదయాన్నే వేద మండపం నందు హోమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం హోమంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు ఆలయ అధికార అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

### పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి శ్రీకాంత్



**సంగారెడ్డి పతినిధి జూన్ 29( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



సోమవారం రోజున స్థానిక రాష్ట్ర పిలుపుమేరకు సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్ లో ఉన్న ప్రభుత్వ బాయ్స్ గర్ల్స్ వివిధ పాఠశాల సర్వే నిర్వహించడం జరిగింది అనంతరం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రాలు మారిన ప్రభుత్వాలు మారిన విద్యార్థుల తలరాతలు మాత్రం ఏ మాత్రం మారడం లేదు విద్యార్థులు ఎదుర్కొన్న ఎదుర్కొంటున్న సమస్యల పైన ఏ ఒక్కరు నోరు తెరవడం లేదు కనీసం చెప్పుకున్న నాధుడు లేడు ప్రభుత్వమేరు పడి రెండున్నర సంవత్సరాలు గడిచిపోయిన ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి పెట్టకపోవడం సిగ్గుచేటు ఒకపక్క విద్యార్థులకు ఎప్పుడో కట్టిన బిల్డింగులు ఎప్పుడు కులుతాయో తెలియని పరిస్థితిలో అదేవిధంగా విద్యార్థుల కనీసం ఇప్పటివరకు యూనిఫామ్ పుస్తకాలు సబ్జెక్టు సరిపడి టీచర్స్ సరైన వాష్ రూమ్ స్కావెంజర్ స్లిప్పర్స్ లేక విద్యార్థులే ప్రభుత్వ పాఠశాలలో నానా ఇబ్బందులు పడతా ఉన్నారు అయినా పట్టించుకోవడం లేదు ఈ ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డట్టు వివరించడం సరైన తీరు కాదు ఇప్పటికైనా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బ్రేక్ఫాస్ట్ మీ లుక్కు పథకాన్ని పాఠశాలలు అందే విధంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి ముఖ్యంగా విద్యార్థుల సంఖ్య కనుగుణంగా బాత్రూంలో నిర్మించాలని అన్నారు లేనిపక్షంలో రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ నాయకులు సిద్దు, సుమన్, ప్రశాంత్, రవి, కిరణ్ ,రమేష్, నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## తొనిగండ్లలో మహిళా సమైక్య భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్




**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 29 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ గారు ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ గారు మాట్లాడుతూ, “మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పన, శిక్షణ, ఆర్థిక సహాయం అందిస్తున్నాం. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి. ఈ మహిళా సమైక్య భవనం ద్వారా గ్రామంలోని మహిళలకు సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వీలు కలుగుతుంది. మహిళల అభ్యున్నతికి మా ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది“ అని అన్నారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ మహిళల చిరకాల కోరిక అయిన సమైక్య భవనాన్ని మంజూరు చేసి, నిర్మాణం పూర్తి చేయించిన ఎమ్మెల్యే గారికి గ్రామ మహిళల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గారు మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## ఏఐటీయుసి రైల్వే కోడూరు నియోజకవర్గ నూతన సమితి ఏకగ్రీవ ఎన్నిక.

**రైల్వేకోడూరు జూన్ 29 రిపబ్లిక్ న్యూస్,**

ఏఐటియసి రైల్వే కోడూరు నియోజకవర్గ 13వ మహాసభలు ఈనెల 28 29 తేదీల్లో రెండు రోజుల పాటు రైల్వేకోడూరులో జరిగాయి

ఈ మహాసభల కు ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ తిరుపతి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు

ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, అందువల్ల కార్మిక వర్గం కు జరుగుతున్న నష్టాలు అన్యాయాలు అందుకు ఏ ఐ టి యు సి నిర్వహిస్తున్న పోరాటాలపై చర్చించడం జరిగింది . ఈ మహాసభలలో 8 తీర్మానాలపై చర్చించి తీర్మానించడం జరిగింది. 21 మంది చర్చలలో పాల్గొన్నారు రైల్వే కోడూరు నియోజకవర్గం లో ఉన్న కార్మిక సమస్యలు చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమానికి రూపకల్పన జరిగింది ఈ సందర్భంగా రెండవ రోజు నూతన సమితిని ఏర్పాటు చేయడం జరిగింది . పరిశీలకులుగా అన్నమయ్య జిల్లా కార్యదర్శి సాంబశివ తిరుపతి జిల్లా ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ డి రవి ల పర్యవేక్షణలో నూతన సమితి ఎన్నిక జరిగింది

ఏఐటియుసి రైల్వే కోడూరు నియోజకవర్గ సమితి 39 మంది ఆఫీస్ బేరర్స్ 15 మంది

గౌరవ అధ్యక్షులుగా – తుమ్మల రాధాకృష్ణ

అధ్యక్షులుగా – మదరాజు గంగాధర్




ప్రధాన కార్యదర్శిగా– దాసరి జయచంద్ర కోశాధికారిగా– పోకూరు మురళి లు ఎన్నిక కావడం జరిగింది

ఉపాధ్యక్షులుగా –5 మంది– సహాయ కార్యదర్శులుగా 6 మంది

ఉపాధ్యక్షులుగా–– అ సరోజమ్మ –జూ రత్నమ్మ ‾ కృష్ణ చైతన్య – స్త్ర దినేష్– వెంకటరమణ

సహాయ కార్యదర్శులుగా –– జూ విష్ణు శివ జ్యోతి – జ మల్లికార్జున్ – వెంకటరమణ– టి మురళి – సి పుల్లయ్య

కౌన్సిల్ సభ్యులుగా–– మణికంఠ – భాను ప్రకాష్– బాలసుబ్రమణ్యం– నాగరాజు– కె సుబ్రహ్మణ్యం– వరప్రసాద్– వై సుబ్రహ్మణ్యం– కుమారి– చెంగమ్మ –కె నిర్మల– దేసయ్య పాండురంగయ్య కృష్ణయ్య– సుబ్బమ్మ –జయమ్మ– సుబ్బరత్నమ్మ –కమలమ్మ – ఎస్ నారాయణ –చెన్నయ్య –పెంచులమ్మ– సుబ్రహ్మణ్యం –పెంచలయ్య– వెంకటరమణ –హబీబ్ బాషా– మురళి..24 మంది కౌన్సిల్ సభ్యులుగా 15 మంది ఆఫీస్ బేరర్స్ గా ఎన్నిక కావడం జరిగినది

## నిర్దేశిత కార్యచరణ ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 29( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



భారత ఎన్నికల సంఘం నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నిర్దేశిత కార్యచరణ ప్రకారం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని, ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పేర్లు, ఇంటిపేర్లు, మహిళల వివాహానంతర ఇంటిపేరు మార్పులు వంటి వ్యత్యాసాలను పరిశీలించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ బూత్ స్థాయి అధికారుల జాబితాలు, పోలింగ్ కేంద్రాల వివరాలు అందుబాటులో ఉంచాలని, రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లతో తరచూ సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రతి శనివారం జిల్లా స్థాయిలో, ప్రతి వారం నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు బి.ఎల్.ఓ. యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, ఎం.ఎస్.ఎస్. వాలంటీర్లు, ఎం.సి.సి. క్యాడెట్లు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని వినియోగించుకోవాలని, గిరిజన, సరిహద్దు ప్రాంతాలలో స్థానిక భాష తెలిసిన హెల్పింగ్ హ్యాండ్స్‌ను నియమించాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించిన అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి అయిన స్టిక్కర్‌ను ప్రతి ఇంటికి అతికించాలని, ఫారాల పూరణ, సమర్పణపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రతి ఈ.ఆర్.ఓ., ఎ.ఈ.ఆర్.ఓ. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పనులను పర్యవేక్షించి, ప్రతి ఎన్యూమరేషన్ ఫారంపై సంబంధిత ఓటరు సంతకం ఉండేలా బూత్ స్థాయి అధికారులు నిర్ధారించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విధుల సమయంలో ప్రతి బూత్ స్థాయి అధికారి తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలని, కొత్తగా నియమితులైన బూత్ స్థాయి అధికారులకు సంబంధిత ఈ.ఆర్.ఓ.లు వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని, ఎన్యూమరేషన్ ఫారాలు, బి.ఎల్.ఓ. కిట్లు, ప్రచార సామగ్రి పంపిణీ పూర్తి చేయబడి, ఇంటింటి సర్వే కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ , నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ ఎన్నికల విభాగ సూపరింటెంట్ గఫార్ ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా !

**జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
ట్రంప్ ప్రంపచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లవ్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి



38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది.అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి. వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.

## కేతన్ అగర్వాల్ హత్యలో రోజుకో కొత్తవిషయం

### హత్యకు ముందు ప్రియుడితో మాట్లాడిన సియా గోయల్

**ముంబై,జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
మహారాష్ట్ర పుణెకు చెందిన ప్రముఖ యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. హత్యకు అరగంట ముందు సియా గోయల్.. తన ప్రియుడు చేతన్ చౌదరికి ఫోన్ చేసి రహస్యంగా మాట్లాడినట్టు కాల్ డీటెయిల్ రికార్డ్స్ ఆధారంగా అధికారులు కనుగొన్నారు. మొబైల్ ఫోన్ల ఫోరెన్సిక్ విశ్లేషణ, సీడీఆర్ పరిశీలనలో ఈ విషయం బయటపడినట్టు తెలిపారు. ఈ కాల్‌ను కుట్రకు సంబంధించిన అత్యంత కీలక డిజిటల్ ఆధారంగా పోలీసులు భావిస్తున్నారు. ఈ సంభాషణలో కేతన్‌తో తానున్న ప్రాపర్ లొకేషన్‌ను ప్రియుడు చేతన్‌కు సియా తెలిపిందని, అక్కడ ఇతర పర్యాటకులెవరూ లేరని నిర్ధారించినట్లు అనుమానిస్తున్నారు. హత్యకు సంబంధించిన ప్రణాళికను దాచిపెట్టేందుకు మూడు నెలలుగా ఇరువురూ సోషల్ మీడియా ఎ÷-లాట్‌ఫామ్స్ వేదికగా షేర్ చేసుకున్న మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ వివరాలను తొలగించినట్లు అధికారులు గుర్తించారు. సదరు డేటాను సైబర్ నిపుణుల సాయంతో వెలికితీసేందుకు యత్నిస్తున్నట్టు తెలిపారు. తొలగించిన సమాచారం, లొకేషన్ వివరాలు, ఇంటర్నెట్ ఐపీ అడ్రస్‌లను పోల్చి చూసి.. ఈ కుట్రను నిరూపించే దిశగా ఆధారాలు సేకరిస్తున్నట్టు




స్పష్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేతన్, సియాలకు నవంబర్‌లో వివాహం జరగాల్సి ఉంది. కానీ ఈ పెళ్లి తనకు ఇష్టం లేకపోవడంతో సియా.. జూన్ 18న లోహగడ్ కోటకు కేతన్‌ను తీసుకెళ్లి కొండపై నుంచి తోసి హతమార్చింది. ఈ కేసులో ఆమె ప్రియుడు చేతన్ చౌదరీ కూడా నిందితుడిగా ఉన్నాడు. కాగా.. మే నెలాఖరులోనే సియా ఈ హత్యకు ఎ÷-లాన్ చేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. జూన్ 14న తొలిసారి కేతన్‌ను కొండపై నుంచి తోసేందుకు యత్నించగా.. అదృష్టవశాత్తూ కేతన్ తనను తాను కాపాడుకుని ప్రాణాలతో బయటపడ్డారని వెల్లడించారు. ఆ సమయంలో పాము కనిపించడంతో అనుకోకుండా అలా జరిగిందని సియా కట్టుకథ అల్లినట్టు చెప్పారు. ఆ ప్రయత్నం విఫలం కావడంతో ఈ నెల 18న రెండోసారి పక్కా ప్రణాళికతో హత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమా నిస్తున్నారు. ఈ ఎ÷-లాన్‌లో కేతన్ తప్పించుకోకుండా ఉండేందుకు చేతన్ కూడా వారిని వెంబడించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. గోయల్, చౌదరీల ఫోన్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఈ విషయాలు బయటపడినట్టు తెలుస్తోంది.

## ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి: నారా లోకేశ్

**అమరావతి, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):**
వచ్చే ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి కనీసం రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరాలన్నదే తన లక్ష్యమని, ఈ మార్పునకు 'షైనింగ్ స్టార్లే' బ్రాండ్ అంబాసిడర్లని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ విద్యా నమూనా గురించే మాట్లాడుకోవాలని ఆకాంక్షించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'షైనింగ్ స్టార్స్' పేరుతో ఘనంగా సత్కరించారు. తాడేపల్లిలోని సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో టెన్త్ టాపర్లు 55 మందికి రూ. 30 వేల నగదు బహుమతి, ఇంటర్ టాపర్లు 61 మందికి ల్యాప్‌టాప్‌లు, పతకాలు అందజేశారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "నిద్రలో కనిపించేది కల కాదు, మిమ్మల్ని నిద్రపోనివ్వనిదే నిజమైన కల. నిద్రపోకుండా మీరు పడిన కష్టమే మిమ్మల్ని షైనింగ్ స్టార్స్‌గా నిలబెట్టింది. మీరు గెలిచారు, నన్ను గెలిపించారు, మన విద్యావ్యవస్థను గెలిపించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మీ పనితీరు వల్ల మంత్రిగా నాకు, 2 లక్షల మంది ఉపాధ్యాయులకు గౌరవం పెరిగింది" అని విద్యార్థులను ప్రశంసించారు. ప్రభుత్వ



పాఠశాలల్లో సీట్ల కోసం ఎమ్మెల్యేల సిఫార్సులు అడిగే రోజులు వచ్చాయని, మంగళగిరిలో ఒక తల్లి తనను నిడమర్రు స్కూలులో సీటు ఇప్పించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

**విద్యారంగంలో సమూల మార్పులు**

విద్యాశాఖను వ్యవసాయంతో పోల్చిన లోకేశ్, ఫలితాలు వెంటనే రావని, నిరంతరం శ్రమిస్తేనే పంట చేతికొచ్చిన ఆనందం దక్కుతుందని అన్నారు. విద్యార్థులను కేంద్రంగా చేసుకుని అనేక సంస్కరణలు చేపట్టామని వివరించారు.

"గతంలో పాఠ్యపుస్తకాలపై ముఖ్యమంత్రి, మంత్రుల బొమ్మలుండేవి. నాకు ఆ ఫోటో పిచ్చి లేదు. అందుకే బ్యాగ్‌పై, బెల్ట్‌పై, గుడ్డుపై, స్కూలులో ఎక్కడా బొమ్మలు లేకుండా చేశాం. పాఠశాలల్లో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశాం" అని తెలిపారు.

'వన్ క్లాస్-వన్ టీచర్', డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్, డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి భోజన నాణ్యతను మరింత పెంచుతామని హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నామని తెలిపారు.

**విలువలకే పెద్దపీట**

విలువలు లేని సమాజం ప్రమాదకరమని, అందుకే నైతిక విలువల కోసం చాగంటి కోటేశ్వరరావు గారిని సలహాదారుగా నియమించామని లోకేశ్ పేర్కొన్నారు. "అమ్మకు చెప్పలేని పని చేయొద్దు అనే ఆయన మాట చాలా శక్తివంతమైనది. మహిళలను గౌరవించడం ఇంటి నుంచే మొదలుకావాలి. తల్లికి వందనం వంటి కార్యక్రమాల ద్వారా ఆ మార్పునకు శ్రీకారం చుట్టాం" అని చెప్పారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని కలలు కనడంతో పాటు, రాజకీయాల్లోకి వచ్చి సమాజాన్ని మార్చే నాయకులుగా కూడా ఎదగాలని ఆకాంక్షించారు.

## తిరుమలలో ముగిసిన జేష్ఠ్యాభిషేకం

### మహాశాంతి హోమంతో ముగించిన వేదపండితులు



**తిరుమల,జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్)::**తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన జ్యేష్ఠాభిషేకం ఆదివారం ఘనంగా ముగిసింది. చివరిరోజు ఉభయదేవేరులతో కలిసి శ్రీమలయప్పస్వామివారు బంగారు కవచంలో పునః దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతో ఉంటారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. శ్రీమలయప్ప స్వామివారికి, దేవేరులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో స్వామి, అమ్మవార్లు బంగారు కవచంలో దర్శనమిచ్చారు. ఆ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు శ్రీ సదాశివరావు, శ్రీమతి జానకి దేవి ,శ్రీమతి సుచిత్ర ఎల్లా, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ లోకనాథం తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే తిరుచానూరులో జరుగుతున్న శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారు పద్మ పుష్కరిణిలో తెప్పపై విహరించి భక్తులకు దివ్య మంగళ దర్శనమిచ్చారు. అనంతరం గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు పద్మ పుష్కరిణి వద్దనున్న నీరాడ మండపంలో శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన తెప్పోత్సవంలో అమ్మవారు ఐదు చుట్లు తిరిగి భక్తులకు అభయప్రద దర్శనం ఇచ్చారు. అనంతరం గజవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు ఆశీస్సులు అందించారు. సోమవారం వార్షిక తెప్పోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారు పద్మ పుష్కరిణిలో ఏడు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించనున్నారు. అనంతరం గరుడ వాహనంపై అమ్మవారు మాడవీధుల్లో విహరించి భక్తులను ఆశీర్వదించనున్నారు.

## విజయ్ ప్రభుత్వం కూలడం ఖాయం

### అది ఎంతో దూరం లేదన్న మాజీ సిఎం స్టాలిన్



**చెన్నై,జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):** తమిళనాడు రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం ఐదేళ్ల పూర్తి పదవీకాలాన్ని పూర్తి చేయదని స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే మూడు నుంచి ఆరు నెలల్లో విజయ్ మైనారిటీ ప్రభుత్వం కూలిపోవచ్చని స్టాలిన్ అన్నారు. ఇది నిలబడే ప్రభుత్వం కాదంటూ ప్రకటన చేశారు. తాజాగా డీఎంకేలో కొందరు కార్యకర్తల చేరిక సందర్భంగా నిర్వహించిన సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం స్థిరంగా కనిపించడం లేదని, రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో పరిస్థితులు ఎలా మారతాయో వేచి చూడాలని అన్నారు. 'మా ప్రగతిశీల కూటమిలోని కొన్ని పార్టీల వ్యూహాత్మక పొత్తు, మద్దతు వల్లే ఈ టీవీకే ప్రభుత్వం మనుగడ సాగించగలుగుతోంది' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఇది అస్థిరమైన ఏర్పాటు. ఈ వాహనం ఏ కూడలిలో అకస్మాత్తుగా ఆగిపోతుందో మనకు తెలియదు అందుకే నేను మీకు చెబుతున్నాను.. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. అవి మూడు నెలల్లో జరగవచ్చు, లేదా ఆరు నెలల్లో జరగవచ్చు. ఐదేళ్ల కాలం పాటు వేచి ఉండే స్థితిలో మనం లేము. ఎలాంటి రాజకీయ పరిస్థితికైనా నూటికి నూరు శాతం మనం సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు స్టాలిన్ సూచించారు.

# ప్రజా అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా సత్వరమే పరిష్కరించాలి

## పీజీఆర్ఎస్‌లో 304 ప్రజా దరఖాస్తుల స్వీకరణ -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోపు పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలకు పరిష్కారం అందించాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించినప్పటికీ తిరిగి రీఓపెన్ అయిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖలు నాణ్యమైన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికకు సంబంధించిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి తగిన ఎండార్స్‌మెంట్‌తో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 148 అర్జీల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు మరింత చేరువగా సేవలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించే అవకాశాన్ని ఈ క్లినిక్‌లు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 148 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 4, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఏ భూములకు సంబంధించినవి 10, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 34, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 59, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 32, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 6 దరఖాస్తులు ఉన్నట్లు వివరించారు.

**పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన కొన్ని ముఖ్య అర్జీలు**

1)బండి ఆత్మకూరు మండలం: భాస్కర్ రావు తన సర్వే నంబర్ 277/2బీ లో 1.30 విస్తీర్ణంగాల భూమిలో 0.9 సెంట్లు తక్కువగా ఉన్నది సర్వేయర్ ద్వారా కొలతలు వేసి ఇప్పించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

2) ఆత్మకూరు మండలం: బిజీ వసుంధర, ఆత్మకూరు మండలం 1105 సర్వే నంబర్లు గల విస్తీర్ణం గల 2.3 ఎకరాల నా భూమిని అక్రమంగా ఆక్రమించి డబల్ రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. కావున నాయదు దయవుంచి 1105 సర్వే నంబర్ భూమిని సర్వే చేయించి నాకు రావాల్సిన 2.30 ఎకరాల భూమిని విచారించి, సర్వే చేయించి ఆన్లైన్ అడంగల్ లో నమోదు చేయగలరని కలెక్టర్‌ను కోరారు.

3) పాణ్యం మండలం: పాణ్యం మండలం చెందిన మాయకోటి మహేష్ 60 సంవత్సరాల నుండి పాణ్యం గ్రామపచాయతీలోని సర్వే నంబర్ 1367,1371 లలో నా పొలమును సాగు చేసుకుంటూ ఉండగా మా పొలం పక్కన యజమానులు భూమి కొలతలు సర్వే చేయించి నిబంధనలకు విరుద్ధంగా మా పొలమును ఆక్రమించుకున్నారు, అధికారులు స్పందించి పొలం సరిహద్దులు ఉన్న రైతులకు నోటీసు ద్వారా తెలియజేసి కొలతలు వేసి న్యాయం చేయగలరని కోరుతూ కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

# ప్రతి ఇంటికి నాణ్యమైన వైద్య సేవలే రెడ్ క్రాస్ లక్ష్యం

**"మీ ఇంటికి మీ డాక్టర్" ప్రాజెక్టు అమలు కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల బ్యూరో, జూన్ 29( రిపబ్లిక్ న్యూస్):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మీ ఇంటికి మీ డాక్టర్" (మొబైల్ మెడికల్ యూనిట్) ప్రాజెక్టు అమలు కమిటీ సమావేశం నంద్యాల కేసీ కెనాల్ కాంపౌండ్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌లో జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షురాలు ప్రాజెక్టు అమలు కమిటీ చైర్‌పర్సన్ రాజకుమారి గణియా గారి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో ప్రాజెక్టు ప్రభావాన్ని అంచనా వేయడంతో పాటు, దాని విస్తరణ, సమర్థవంతమైన అమలు కోసం చేపట్టాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టు పురోగతిని సమీక్షించిన జిల్లా కలెక్టర్, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలు, అవసరమైన మందులు అందించడం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆర్ ఈ సి లిమిటెడ్ సంస్థ వారి సి ఎస్ ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్) సహకారంతో అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా 2026 మార్చి 26 నుంచి జూన్ 15 వరకు తొలి మూడు నెలల్లో బండి ఆత్మకూరు మండలంలో మొత్తం 6,472 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు..ప్రతి ఇంటికి నాణ్యమైన ఆరోగ్య సేవలు చేరేలా చర్యలు తీసుకుంటూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి రెడ్ క్రాస్ సంస్థ కట్టుబడి పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రెటరీ వడ్రాల శ్రీకాంత్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి, ఫ్యాక్టరీస్ మేనేజర్ నారాయణ రెడ్డి, జీఎం ఇండస్ట్రీస్ మహబూబ్ బాషా, ప్రాజెక్టు వైద్యులు డాక్టర్ కమల్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ మమతా రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ అరుణకుమారి, ఇతర సభ్యులు, ప్రాజెక్టు సిబ్బంది, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఏరువాక ఉత్సవం

## రసాయనాలు తగ్గించి ప్రకృతి సాగు వైపు మళ్లాలని ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు!



**నంద్యాల జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్):** ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభమైన సందర్భంగా నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్ ) ప్రాంగణంలో సోమవారం "ఏరువాక పౌర్ణమి" కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ మరియు రైతు సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవానికి జిల్లాలోని అగ్రనేతలు, ఉన్నతాధికారులు మరియు వేలాది మంది రైతులు తరలివచ్చారు. సభకు విచ్చేసిన రైతులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పిఎండిఎస్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ & డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ రాజకుమారి మాట్లాడుతూ "జిల్లాలో భూసార రక్షణకు పిలుపునిచ్చారు. మన నంద్యాల జిల్లాలో యూరియా, రసాయన ఎరువుల వాడకాన్ని భారీగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని, స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో ఇప్పటికే 70,000 మంది రైతులు 45,000 హెక్టార్లలో విజయవంతంగా ప్రకృతి సాగు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో దీనిని మరింత విస్తరించి 1,00,000 (లక్ష) హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయాన్ని తీసుకురావాలన్నారు. జిల్లా ఉమ్మడి వ్యవసాయ అధికారి (జేడిఏ) మన్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.."ప్రస్తుతం వాతావరణంలో కనిపిస్తున్న ఎల్‌నిన్యో ముప్పు మరియు దాని వల్ల వచ్చే విపత్తుల గురించి రైతులకు వివరించారు. రైతులు నీటి లభ్యతను బట్టి వరి పంట సాగును తగ్గించి, ఎండలను తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలు, తృణధాన్యాలు వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో చాలా మంది రైతులు కరవును తట్టుకునే పిఎండిఎస్ సాగు పద్ధతిని పాటించారని, వారిని చూసి మరికొంత మంది రైతులు ముందుకు రావడం శుభపరిణామన్నారు". అనంతరం గౌరవ పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ.."రైతులు ఎప్పుడూ ఒకే పంట (ఏకపంట) పై ఆధారపడకుండా, అంతర పంటలు మరియు బహుళ పంటలు వేసుకోవడం ద్వారా వాతావరణ మార్పుల వల్ల వచ్చే నష్టాల నుంచి బయటపడవచ్చని సూచించారు. అలాగే, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రైతన్న మీకోసం" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు రెండు లక్షల మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, ఈ నమోదు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం సకాలంలో "అన్నదాత సుఖీభవ" పెట్టుబడి నిధులను నేరుగా ఖాతాల్లోకి విడుదల చేసి రైతన్నకు కొండంత అండగా నిలిచిందని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ , నంద్యాల్ ఎంపీ శబరి , పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత రెడ్డి , నంద్యాల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు , జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా , ఆర్ఏఆర్ఎస్-ఏడీఆర్ జయలక్ష్మి , జిల్లా ఉమ్మడి వ్యవసాయ అధికారి శ్రీ మన్నా వెంకటేశ్వర్లు , జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు , జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన ఏడీఏలు, ఏఓలు, ఆళ్లగడ్డ, పాణ్యం వ్యవసాయ రంగ సిబ్బంది పాల్గొన్నారు

# మధులోహితను ఘనంగా సన్మానించిన నారా లోకేష్



రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కుల సాధించిన విద్యార్థులతో నారా లోకేష్ (వృత్తంలో మధు లోహిత)

**బండి ఆత్మకూరు, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని మధులోహితను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఘనంగా సన్మానించారు. స్థానిక మోడల్ స్కూల్లో సీనియర్ బైపీసీ గ్రూపునకు చెందిన మధులోహిత ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మాన కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండి ఆత్మకూరు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని మదులోహితను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఘనంగా సన్మానించారు. అలాగే విద్యార్థిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉన్నత చదువుల కోసం, డిజిటల్ విద్య ఎంతో దోహదపడుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.52 వేల రూపాయల విలువైన హై పెర్ఫార్మెన్స్ హెచ్.పీ ల్యాప్టాప్ ను మధు లోహితకు నారా లోకేష్ బహుమతిగా అందజేశారు. దీంతో పాఠశాల యాజమాన్యంతో పాటు బండి ఆత్మకూరు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మధులోహిత సాధించిన ఈ అసాధారణ విజయంతో నంద్యాల జిల్లాతో పాటు బండి ఆత్మకూరు ఏపీ మోడల్ స్కూల్ పేరు రాష్ట్రస్థాయిలో మారు మ్రోగిందని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విధంగా ఆమెను తీర్చిదిద్దిన ప్రిన్సిపల్ అధ్యాపక బృందాన్ని విద్యాశాఖ అధికారులు స్థానిక ప్రజలు అభినందించారు.

# నంద్యాల వైద్యుల సేవలు ప్రశంసనీయం

**: ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**

**నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా వైద్యుల దినోత్సవం**

**. వైద్య రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను: ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

**. వైద్య వృత్తి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసిన డాక్టర్ రవి కృష్ణ**

**. వైద్యుల దినోత్సవ పురస్కారాల ప్రదానం**

**. వైద్యుల దినోత్సవ క్రీడా సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతి ప్రదానం**



**నంద్యాల జూన్ 29 (రిపబ్లిక్ న్యూస్) :**

ఐఎంఏ నంద్యాల ఆధ్వర్యంలో భారతరత్న, స్వాతంత్ర్య సమరయోధుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బి.సి.రాయ్ జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక సూరజ్ గ్రాండ్ హోటల్ సమావేశ మందిరంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిథిగా,గౌరవ అతిథిగా ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ పాల్గొన్నారు.

ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. డాక్టర్ బి. సి.రాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఐఎంఏ వైద్యుల దినోత్సవ పురస్కారాలను డాక్టర్ తారకేశ్వర రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ సునీత,నీట్ పి.జి. పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించిన డాక్టర్ నెరవాటి గగన్ లకు ఎంపీ అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ వైద్యులు రోగి ప్రాణాలు కాపాడడానికి శాయ శక్తుల ప్రయత్నం చేస్తారని, వైద్యో నారాయణో హరి గా భారత సంస్కృతిలో చెప్పారన్నారు. నంద్యాల వైద్యులు సేవా దృక్పథంతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఐఎంఏ భవన నిర్మాణానికి వైద్యురాలిగా సహకారం అందజేస్తామన్నారు. రాష్ట్ర వైద్యుల రక్షణ చట్టం సవరించడం, కేంద్ర వైద్యుల రక్షణ చట్టం కోసం, ఏక గవాక్ష విధానంలో ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సరళీకృతం చేయడానికి, వైద్యులు, వైద్య సిబ్బందిపై కేసులు నమోదు చేసే సమయంలో పాటించవలసిన నిర్దిష్ట నిబంధనావళి రూపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ దేశంలో 1928లో ప్రారంభించబడిందని ఇప్పుడు 35 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో 1750 బ్రాంచీలలో నాలుగు లక్షల మంది సభ్యులతో ప్రపంచంలో అతిపెద్ద వృత్తి స్వచ్ఛంద సంస్థ ఐఎంఏ అని అన్నారు.దేశంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి కృషి చేస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 100 బ్రాంచ్ లలో ఇరవై మూడు వేల మంది ఐఎంఏ సభ్యులు అటు ప్రభుత్వ రంగంలో, ప్రైవేటు రంగంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని, వైద్య రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎంపీ డాక్టర్ పై రెడ్డి శబరిని నంద్యాల వైద్యులు ఘనంగా సత్కరించి అభినందించారు.

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యులకు,వైద్యుల కుటుంబ సభ్యులకు నిర్వహించిన వివిధ క్రీడా, సంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్, ఐఎంఏ నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు,డాక్టర్ మధుసూదన రావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్,నంద్యాల శాఖ మహిళా విభాగ నాయకులు డాక్టర్ నర్మద ,డాక్టర్ నాగమణి, డాక్టర్ హరిత ,డాక్టర్ సునీత, డాక్టర్ లలిత, డాక్టర్ ఆరిఫా బాను అధిక సంఖ్యలో వైద్యులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

# తల్లికి గర్భశోకం..

## అయ్యో ఉన్న ఒక బిడ్డ జల సమాధి

**కుందూ నదిలో బాలుడి మృతదేహం లభ్యం -కాకనూరులో తీవ్ర విషాదం**



మృతి చెందిన నాగ చరణ్



నాగ చరణ్ ఫైల్ ఫోటో

**బండి ఆత్మకూరు, జూన్ 29, (రిపబ్లిక్ న్యూస్):-**

ఉన్న ఒక్కగాను ఒక బిడ్డ తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోవడం అనేది ఆకుటుంబానికి జీవితంలో భరించలేని అతిపెద్ద విషాదం. ఆ తీరని శోకాన్ని మాటల్లో వర్ణించడం అసాధ్యం. అలాంటి ఘటనే బండి ఆత్మకూరు మండలంలోని కాకునూరు గ్రామంలో చోటుచేసుకుంది. భర్త అనారోగ్యం పాలైన ఆతల్లి పుట్టిన ఒక కొడుకును పోషించుకునేందుకు కూలి పనికి వెళ్ళేది. అయితే ఆమె ఇంటికి తిరిగి వచ్చేలోపు తమ కుమారుడు కళ్ళ ముందు కనిపించకపోవడంతో ఆ తల్లి తల్లడిల్లుతూ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ వెతికి చివరకు చేసేదేమీ లేక పోలీస్ స్టేషన్ను ఆశ్రయించింది. అయితే అప్పటికే ఆతల్లికి గర్భశోకం మిగిలింది అనే విషయం తెలియదు. స్థానికులు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగార్జున, చెవిటి ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు నాగ చరన్ అనే తొమ్మిది సంవత్సరాల బాలుడు ఆదివారం ఉదయం ఇంటి నుండి ఆడుకోవడానికి బయటకు వెళ్లి సోమవారం ఉదయము స్థానిక కుందూ నదిలో శవమై కనిపించాడు. దీంతో కాకనూరు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఆ బాలుడు కుందునదికి వెళ్లి ఈత కొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కుందూ నదిలోనే జల సమాధి అయ్యాడు. దీంతో ఉన్న ఒక్క కొడుకు మృత్యు ఒడికి చేరుకొని తమ కళ్ళ ముందు విగత జీవిగా కనిపించడంతో ఆ తల్లి రోధిస్తున్న తీరు అందరిని కలిచి వేసింది. ఆ తల్లిని ఆపడం ఎవరి తరం కాలేదు. ఈ క్రమంలో పోలీసులు బాలుడి మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం బాలుడు తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com